క్లుప్తంగా

వంద శాతం సర్వే పూర్తి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీలో సర్వే వంద శాతం పూర్తయినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. ఆదివారం వరకు 14 వేల 800 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర కుటుంబ కులగణన పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శనివారం నుంచి సర్వే పత్రాల్లోని వివరాలు ఆన్‌లైన్ చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. ఎంపీవో మలహరి, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం ఏఎస్సై ప్రకాష్‌నాయక్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించినట్లు తెలిపారు. అలాగే వాహన చోదకులు వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కానిస్టేబుల్ పెంటయ్య, సిబ్బంది ఉన్నారు.

స.హ.చట్టంతో అన్ని వివరాలు పొందొచ్చు



ఎల్లారెడ్డిరూరల్: సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని వివరాలను పొందవచ్చని స.హ. చట్టం పరిరక్షణ కమిటీ నాయకులు లింగమయ్య అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు స.హ.చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్, సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



ఎల్లారెడ్డిరూరల్: మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించేలా చూడాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదివారం పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షులు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాళ్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, పాఠశాలలో హవర్లీ బేస్డ్ టీచర్లకు పనికి తగిన వేతనాలు చెల్లించేలా చూడాలని వారు కోరారు. సాయిబాబా, రాజశేఖర్, చారి, విద్యారమణ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బీబీపేట: మండలంలోని యాడారం గ్రామానికి చెందిన గన్నమనేని రంగమ్మ అనారోగ్యంతో చికిత్స తీసుకోవడంతో ఆమె కుమారుడు తిరుపతి రావుకు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అందజేశారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

రాజంపేట పరిధిలో..



రాజంపేట: మండలంలోని ఆర్గోండ, అన్నారం, అన్నారం తండా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు సుభాష్ నాయక్, మండల యూత్ జనరల్ సెక్రటరీ ఎర్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు శివయ్య, నారాయణ శ్యామయ్య, శ్రీనివాస్, రాములు,రాజు, గ్రామ అధ్యక్షులు, కిషన్, ఉపాధ్యక్షులు, తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

దోమకొండ: ముత్యంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రంగులు వేయడానికి గ్రామ గౌడ సంఘం నేతలు ఆదివారం రూ.10 వేలు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం శైలజ తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముత్తగారి శిరీష్‌గౌడ్ సైతం రూ.5 వేలు అందజేశారు. గౌడ సంఘం ప్రతినిధులు నారాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శిరీష్‌గౌడ్, సిద్ధాగౌడ్, సంఘం ప్రతినిధులు ఉన్నారు.

వంతెన పూర్తయ్యేదెప్పుడో..?

- నిలిచిపోయిన నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



సింగితం గ్రామ శివారులో అర్ధంతరంగా ఆగిపోయిన వంతెన నిర్మాణ పనులు

నిజాంసాగర్(జుక్కల్): వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్మాణ పనులు మాత్రం నత్తక నడక నేర్చినట్లుగా సాగుతూ ఉన్నాయి. నిర్మాణం ఆలస్యం అవుతుండటంతో రైతుల బాధ వర్ణనాతీతంగా ఉంది. మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం గ్రామ శివారులో ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో 460 ఎకరాల్లో పంటల సాగుకు రైతులు కొన్నేళ్లుగా వరద నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆయకట్టు ప్రాంత రైతులు ప్రాణాలను పణంగా పెట్టి వరద నీటిని దాటి వెళ్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగు దాటే క్రమంలో రైతులతో పాటు పశువులు సైతం గల్లంతయిన ఘటనలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు స్థానిక రైతులకు వంతెన నిర్మిస్తామని నాయకులు హామీలిచ్చారు. కాని ఎన్నికలు పూర్తయిన తర్వాత పాలకులు పట్టించుకోవడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు ప్రభుత్వం సింగితం వాగుపైన వంతెన నిర్మాణానికి రూ.4.8 కోట్లు మంజూరు చేసింది. వంతెన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. దాంతో గత ప్రభుత్వ హయాంలోనే వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు.

రెండు నెలల క్రితం..

వంతెన నిర్మాణ పనులపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. వర్షాకాలంలో వరద నీటి ప్రవాహం నిర్మాణ పనులకు ఆటంకం కల్గుతుందన్న సాకుతో పనులను మధ్యలోనే ఆపేశారు. వర్షాకాలం పూర్తయి 2 నెలలు గడిచినా పనుల జాడ కరువైంది. వాగుపై వంతెన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు, సింగితం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



సింగితం వాగుపై వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలి. వాగుపై వంతెన కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. వర్షాలు బంద్ కావడంతో పనులు చేపట్టి రైతుల కష్టాలను దూరం చేయాలి.
– చింతకింది సింగబోయి, రైతు, సింగితం

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత చంద్రశేఖర్

కామారెడ్డి అర్బన్: అంగన్‌వాడీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కే.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. అంగన్‌వాడీలకు పక్కా భవనాలు నిర్మించాలని, కనీసం వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్టుగా అలవెన్సులు చెల్లించాలని, ఉద్యోగ విరమణకు 2 లక్షలు, నెలనెలా పెన్షన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నేతలు సురేష్, వి.కల్పనలు మాట్లాడుతూ.. అర్హతగల హెల్పర్లకు టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చి, సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాబాయ్, బి.లక్ష్మి, అనసూయ, సురేఖ, రాణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మాల సంఘం అధ్యక్షుడిగా గుర్రం మోహన్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గ మాల సంఘం అధ్యక్షుడిగా గుర్రం మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకులు అయ్యాల సంతోష్ తెలిపారు. ఆదివారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యదర్శిగా నీరడి శేఖర్, కోశాధికారిగా బేగరి సాయిబాబాలను ఎన్నికయ్యారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని వారు అన్నారు.

భారత్ రోడ్డు ఆర్యవైశ్య సంఘ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: స్థానిక భారత్ రోడ్డు ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సిద్దంశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శిగా తాటిపల్లి సునీల్, కోశాధికారిగా కొడిశాల గంగాధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సంఘ సభ్యులు నూతకంగా ఎన్నికైన ప్రతినిధులను సన్మానించారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టిజన్లు

కామారెడ్డి అర్బన్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా పనిచేస్తున్న కార్మికులను కన్వర్షన్ చేయాలని, ఈ విషయాన్ని ప్రతిపక్షనాయకునిగా శాసనసభలో సీఎం దృష్టికి తీసుకుపోవాలని ఆర్టిజన్ల జేఏసీ ఆదివారం రాత్రి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసింది. విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లను కన్వర్షన్ చేయడం ద్వారా సంస్థకు ఎలాంటి ఆర్థిక భారం కాదన్నారు. ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.స్వామి, శ్రావణ్ తదితరులున్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-5 ఆధ్వర్యంలో వాలంటీర్లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్‌వర్క్ డిపార్టు, ఆ ప్రాంతంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి బందెల అంజయ్య వాలంటీర్లు పాల్గొన్నారు.

ధాన్యం రవాణా వేగవంతం చేయాలి



పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేందర్ కుమార్

ఎల్లారెడ్డిరూరల్: ధాన్యం రవాణా వేగవంతం చేయాలని తహసీల్దార్ మహేందర్ కుమార్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి, గండిమాసానిపేట గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కాంటా కాగానే రవాణా చేయాలని, రవాణాలో ఎలాంటి జాప్యం చేయవద్దని సూచించారు. గిర్దావార్ శ్రీనివాస్, కార్యదర్శి విశ్వనాథం తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మహేందర్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో గల వసతులు, కావాల్సిన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన ఫారాలను తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. గిర్దావార్ శ్రీనివాస్, బీఎల్‌వో అమృత తదితరులున్నారు.

గడువులోగా ఓటు నమోదు చేసుకోవాలి



మద్నూర్(జుక్కల్): ఓటు నమోదు కోసం ఈ నెల 28 లోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ముజీబ్ పేర్కొన్నారు. మండలంలోని తడి హిప్పర్గ, సోనాల, మద్నూర్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం తహసీల్దార్ పరిశీలించారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీయువకులు ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ తెలిపారు. ఆర్‌ఐ శంకర్, సూపర్‌వైజర్ రవి, బాలరాజు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమం సమీపంలో కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టును నాసిరకంగా కట్టడంతో సిమెంటు, కంకర, ఇనుపరాడ్లు పోయి పక్క గుంతగా ఏర్పడింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేసేవారు ఆదమరిస్తే ప్రాణాలు పోవాల్సిందే. దగ్గరకు వచ్చేంత వరకు గుంత ఏర్పడటం లేదు. రాత్రి వేళ మాత్రం ఈ రహదారిలో ప్రయాణం మరీ ప్రమాదకరం. ఈ గుంత రోడ్డు మూలమలుపున ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కల్వర్టుకు మరమ్మతులు చేయించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి లోగల గౌరీ శంకర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నంగునూరు కిరణ్ కుమార్, కార్యదర్శి సీహెచ్ వెంకటేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సామూహిక గాయత్రి హోమం



కామారెడ్డి అర్బన్: స్థానిక విశ్వనాథేశ్వర ఆలయంలో ఆదివారం వైదిక ఉపన్యాసకులు ఆచార్య వేద సింధు ఆర్యన్ ఆధ్వర్యంలో సామూహిక పంచకుండీయ గాయత్రీ హోమం, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య వేదసింధు ఆర్యన్ మాట్లాడుతూ.. గాయత్రీ హోమం ద్వారా స్వర్గం, సుఖం, శాంతి, ఆరోగ్యం, ఆయుషు, విద్యా, బలం, సుసంతానం, ధనం, ఐశ్వర్యం, యశస్సు, కీర్తి, మోక్షం కల్గుతుందన్నారు. ఆర్యసమాజం ప్రతినిధి ఇప్పకాయల నర్సయ్య, ఆలయ ప్రతినిధి టి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి వేడుకలు ప్రారంభం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో వీరభద్రుడి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో వీరభద్రుడి కల్యాణం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలకు చెందిన భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి తర్వాత 8వ రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అర్చకులు శివ, సంగప్పలు తెలిపారు. వీరభద్రుని ఉత్సవాల సందర్భంగా సోమవారం దశయజ్ఞం(అగ్నిగుండం) నిర్వహించనున్నట్లు అర్చకులు చెప్పారు. భక్తులు నిప్పు కణికలపై నడిచి తమ భక్తిని చాటుకుంటారన్నారు.

'నీహారిక' వీడియో పాట సిడీ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ రచించి చిన్నికృష్ణ సంగీత దర్శకత్వంలో పాడి రూపొందించిన 'నీహారిక' వీడియో పాట సిడీని ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ జిల్లా ఫోరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సీడీని విడుదల చేశారు. గఫూర్ రచయిత, కవిగా మంచి సాహిత్యం కలిగి ఎన్నో పుస్తకాలు రాయగా, పాటల రచయితగా పేరు సంపాదించాలని శంకర్ ఆకాంక్షించారు. యూట్యూబ్ నటీనటులు శివ, ఝాన్సీ, దర్శకుడు కొడి రవీందర్, తెరవే ప్రతినిధుల అల్లి మోహన్‌రాజ్, తిరుపతిరావు, ప్రభాకర్, సంగాగౌడ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యా మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మాచారెడ్డి: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం విద్యా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి మాట్లాడారు. కామారెడ్డి పట్టణంలో డిసెంబర్ 1, 2 తేదీలలో నిర్వహించనున్న విద్యా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పొదర్ల రవి, రామచంద్రం ఉన్నారు.

చిట్టి చేతులు.. వెచ్చటి సాయం



దుప్పట్లను పంపిణీ చేస్తున్న విద్యార్థులు

బాన్సువాడ రూరల్: ఫుట్‌పాత్‌లు, బస్టాండ్, దుకాణ సముదాయాల ముందు చలితీవ్రతకు బాధపడుతున్న నిస్సాహాయులను చూసిన ఆ చిన్నారులు చలించిపోయారు. క్లాస్‌రూంలో ఈవిషయంపై చర్చించి వారికి దుప్పట్లు పంపిణీ చేయాలని నిశ్చయించుకున్నారు. రూ.5వేలు పోగు చేసి సుమారు 25 మంది నిరాశ్రయులకు, వీధిబాలలకు ఆదివారం వేకువజామున ఉపాధ్యాయులతో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలకు సాయం చేయాలనే ఆలోచన రావడం హర్షణీయమని, ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానవత్వ విలువలు, సేవాదృక్పథం నెలకొంటుందని న్యూటన్స్ హైస్కూల్ ప్రిన్సిపల్ దాసరి మహేందర్ అన్నారు. ఉపాధ్యాయులు సయ్యద్ బిలాల్, శ్రీనివాస్, విద్యార్థులు సాయిచరణ్, సయ్యద్ నిహాల్,తదితరులున్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు..

భిక్కనూరు: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి ముదిరాజు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన ఈగ లక్ష్మి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ముదిరాజు ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆమెకు రూ. 5 వేలను అందజేశారు.

నిరుపేద యువతి అంత్యక్రియలకు..

భిక్కనూరు: బస్వాపూర్‌లో జ్యోతి అనే యువతి అకస్మాత్తుగా ఆదివారం మృతి చెందింది. యువతి కుటుంబం నిరుపేదరికంలో ఉండడంతో దళిత సంఘం ప్రతినిధులు ఆమె అంత్యక్రియలకు రూ.10 వేలు కుటుంబీకులకు అందజేశారు.

సాయం చేసిన బీజేపీ నేత

కామారెడ్డి రూరల్: దేవునిపల్లిలోని 35వ వార్డులో పోశమ్మల కాలనీలో సాయవ్వ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందగా దహన కార్యక్రమాలు నిర్వహించుకోలేని పరిస్థితిలో ఆమె కుటుంబం ఉంది. సాయవ్వ భర్త గతంలో చనిపోగా, మానసికంగా ఎదగని పదేళ్లలోపు ఇద్దరు కుమారులున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రాజుపాటిల్ పేద కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు అందజేశారు.

సింహగర్జన సభను విజయవంతం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాల మహానాడు నాయకులు

బాన్సువాడ రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య కోరారు. ఆదివారం ఆయన మాలమహానాడు నాయకులు నెర్రె నర్సింలు, గైని రవి, మన్నె చిన్న సాయిలు తదితరులతో కలిసి ఇబ్రాహీంపేట్, సంగోజిపేట్ గ్రామాల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో మాలసంఘం సభ్యులతో సమావేశమయ్యారు. సభకు మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మేధావులు, రాష్ట్ర నాయకులు హాజరై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాయన్నారు. నాయకులు శివయ్య, కొత్తపల్లి సాయిలు, మన్నె గంగారాం, సంగయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ పోస్టర్ల ఆవిష్కరణ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాలల బహిరంగ సభ పోస్టర్లను మాలమహానాడు సంఘం నాయకులు ఆవిష్కరించారు. మాల మహానాడు సంఘం నాయకులు రాజు, బంగారు మైసయ్య, గైని విఠల్, రాము, గైని రమేశ్, రాములు, చిన్నసాయిలు తదితరులున్నారు.

సంక్షిప్తం

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

పిట్లం(జుక్కల్): రాంపూర్, గౌరారం గ్రామాలలో ఆదివారం సైబర్ నేరాలపై ప్రజలకు హెడ్ కానిస్టేబుల్ సాయగౌడ్ అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మీకు లాటరీ వచ్చిందని మీరు డబ్బులు కట్టాలని మీ నుంచి ఓటీపీని తీసుకొని మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులు మొత్తాన్ని కాజేస్తారని చెప్పారు. ఎవరైనా గ్రామంలో కొత్తవారు అనుమానంగా సంచరించినట్టు అనిపిస్తే పిట్లం పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కానిస్టేబుల్ రవిచంద్ర గౌడ్, వెంకాగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుర్తి గ్రామ మాల సంఘం నూతన కమిటీ ఎన్నిక

పిట్లం(జుక్కల్): కుర్తిలో గ్రామ మాల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేగరి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా నీరుడి బాలరాజ్, ఉపాధ్యక్షులుగా పోతరాజు అంజయ్య, కోశాధికారిగా ఎస్.రాజయ్య, సహాయ కార్యదర్శిగా పి.పాపయ్య, సలహాదారులుగా పి.సాయిలు, మీడియా ఇన్‌చార్జిగా ఎన్.సాయిలు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ఏమైనా సమస్యలున్నట్లయితే ఈ ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు.

కొల్లూర్, నాగారం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

బాన్సువాడ రూరల్: కొల్లూర్, నాగారం గ్రామాల్లో సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నట్లు పంచాయితీ కార్యదర్శి సృజన్‌రెడ్డి తెలిపారు. నాగారం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ ..అనంతరం కొల్లూర్ గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తారన్నారు. అలాగే కొల్లూర్-నాగారం గ్రామాల ప్రజల సౌకర్యార్థం నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



భిక్కనూరు: నేరాల నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం బస్వాపూర్‌లో యూత్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలతో పాటు గ్రామంలోని కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన యువత శాంతిభద్రతల పరిరక్షణకు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. బస్వాపూర్ యువతను అన్ని గ్రామాల యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ యువకులు పాల్గొన్నారు.